క్లుప్తంగా

ఏసీపీని కలిసిన నాయకులు



ఏసీపీ శ్రీనివాస్‌జీని సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్ జీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ జమ్మికుంట మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వీరంనేని పర్శరామ్‌రావుతో వివిధ పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ జీని కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వెంట కాంగ్రెస్ నాయకులు తిరుమలేశ్, సురేందర్‌రెడ్డి, మండల అనిల్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

కాలువకు గండి



పరిశీలిస్తున్న అధికారులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ శివారులో 4 ఎల్ కాలువకు గండి పడింది. నీటి ప్రవాహానికి కాలువ కింది పంటపొలాలు దెబ్బతిన్నాయి. వేసవిలో నీటి ఎద్దడి దృష్ట్యా వేసిన కొద్దిపాటి పంట నీటి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాలువలకు గండ్లు పడుతున్నాయని రైతులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఉన్నతస్థాయి స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్నల్ మార్కులు పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గురుకుల, పోచంపల్లి మోడల్ స్కూళ్లను శుక్రవారం మానిటరింగ్ అధికారులు తనిఖీ చేశారు. మానిటరింగ్ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, సత్యనారాయణ పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, అర్చనా ప్రియదర్శిని పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



పూర్తి కావస్తున్న ఏర్పాట్లు

శంకరపట్నం: మండల కేంద్రంలో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర పనులను శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పరిశీలించారు. జాతర ప్రాంగణం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ, అమ్మవార్ల గద్దెల ఆధునీకరణ పనులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు కోసం చలువ పందిళ్లు, క్యూలైన్లు, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఈఓ మారుతిరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులు సరికావు



మాట్లాడుతున్న వడ్లూరి వాసు

హుజూరాబాద్: ప్రజాస్వామ్యంలో మతతత్వపు దాడులు సరికాదని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని జన్వాడ గ్రామంలో ఇటీవల చర్చిపై జరిగిన దాడిని తీవ్ర ఖండిస్తున్నామని, దాడిపై నిరసనకు వెళ్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుంటూ స్వేచ్ఛ హక్కును కాలరాస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు రాజ్యాంగానికి లోబడి జీవించాలని, అన్ని కుల మతాలను సమానంగా గౌరవించాలన్నారు. ఆహార అలవాట్లు, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. చర్చిపై దాడిచేసిన వారిని గుర్తించి వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సందేల వెంకన్న, చల్లూరి రాజు, రాజ్‌కుమార్, ఆకునూరి అచ్యుత్ ఉన్నారు.



చొప్పదండి: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు

కార్మికుల నిరసన

చొప్పదండి: దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని హమాలీ, పవర్‌లూం, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు యు. శ్రీనివాస్ మాట్లాడు తూ... కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికుల బతుకులు ఆగమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గన్నేరువరం: సీపీఐ, ఏఐటీయూసీ, ఆటో కార్మికులు, ఇతర కార్మికులు గన్నేరువరంలో బంద్ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సీనియర్ అసిస్టెంట్ పహీంకు వినతి పత్రం అందజేశారు. సమైక్యత, సమగ్రతవిఘాతం కల్గించే అనేక చట్టాలను కేంద్రం అమలు చేస్తోందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు.

శంకరపట్నం: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలో వామపక్షాలు బంద్ నిర్వహించాయి. సీపీఐ, సీపీఎం నాయకులు, కార్మికులు అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధాలనాలను అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా వ్యవహరిస్తోందన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లించాలని, కార్మికులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తహసీల్దార్ అనుపమకు వినతి పత్రం సమర్పించారు.

మానకొండూర్‌రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఏఐటీయూ నాయకులు బంద్ పాటించారు. జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను విస్మరించినందుకు దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. పదేళ్లుగా రైతులు, కార్మికులను, ప్రజల సమస్యలను పరిష్కరించడం, ధరల నియంత్రణలో వైఫల్యం చెందిందన్నారు. 2కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని నిరుద్యోగులతో చెలగాటమాడుతుందన్నారు.

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్‌లో ఆటో యజమానులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో నడుపుకొని కుటుంబాన్ని గడిపే వారమని ఇప్పుడు ఆటోలే నడవడం లేదన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ధర్నా



జమ్మికుంటలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిరమేశ్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాము



గన్నేరువరంలో సీనియర్ అసిస్టెంట్ పహీంకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జమ్మికుంట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, స్వామినాథన్ కమిషన్ సిపార్సుల ప్రకారం రైతులకు మద్దతు ధర కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము డిమాండ్ చేశారు. పట్టణంలోని మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంధుకు మద్దతుగా నిరసన ర్యాలీ చేపట్టారు. రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బెల్టుల ప్రదానం



విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న తైక్వాండో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నిర్వాహకులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి స్కూల్‌లో శుక్రవారం తైక్వాండో కరాటే పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు ఎల్లో, గ్రీన్, గ్రీన్ ప్లస్, బ్లూ బెల్టులను తైక్వాండో జిల్లా అధ్యక్షుడు డి. సంతోష్‌కుమార్ అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ అలె వెంకటనారాయణ, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రైనర్ సంతోష్, టీచర్లు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్(ప్రభు) మాస్టర్ అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 45 సంవత్సరాల విభాగంలో హైమర్ త్రోలో ద్వితీయ స్థానం నిలిచి వెండి పతకం సాధించాడు. ఈకార్యక్రమంలో టీజీపీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి శంకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: సన్మానిస్తున్న టీజీపీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శంకర్

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష



ప్రశ్న పత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరీశ్, శ్రీకాంత్, తదితరులు

జమ్మికుంట: విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీయడానికి ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఎంఈవో విడుపు శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో భయం, బెరుకు పోగొట్టేందుకు, పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఉద్యమాలతోపాటు విద్యార్థులకు మనోధైర్యం కలిగించే విధంగా పని చేయడం అభినందనీయమన్నారు. జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు ప్రశ్న పత్రాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరీశ్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు చెవి శ్రీకాంత్, పలువురు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రాము

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో శుక్రవారం ఎంపిడివో ధమ్మని రాము తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి నిర్వాహణ తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయితీలో సమస్యలపై ఆరా తీసారు.

ఆశా వర్కర్ల ర్యాలీ

సైదాపూర్: పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు శుక్రవారం సైదాపూర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీసి తహసీల్దార్ మంజులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కదిరే రమేశ్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

గంగాధర: సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఆశావర్కర్లు సమ్మె నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శంకరమ్మ, పి.అరుణ, కె.రాణి, కె.సుమలత, అనిత, భారతి పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ...



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం ఐఏయూవైఎస్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ అసోసియేషన్ ప్రతినిధులు గోస్కుల పవన్, మాట్లా జవహర్ చటర్జీ, చిట్టంపెల్లి అఖిల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సంస్థ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు నిఖిత, శ్రీలత, దివ్య, రవళి ఉన్నారు.

నాలెడ్జ్ పెంచుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: సిమెంట్ రంగంలో రోజురోజుకి అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అపారమైన ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతున్నాయని ఆదిత్య బిర్లా సిమెంట్ కంపెనీ తెలంగాణ రీజినల్ హెడ్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేటివ్ కాంక్రీట్ ఇన్ ది ఫ్యూచర్ ఆఫ్ బిల్డింగ్ మెటీరియల్స్ అనే సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రంగంలోని మార్పులకు అనుగుణంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయని, విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కాంక్రీట్ టెక్నాలజీ అనే సబ్జెక్టు పరీక్షలో మార్కులు సాధించిన సోనియా అనే విద్యార్థికి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికునికి తీవ్రగాయాలు

జమ్మికుంట: తాటిచెట్టుపై నుంచి పడటంతో గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని రంగమ్మపల్లికి చెందిన బాలసాని శ్రీనివాస్ వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. చుట్టు పక్కల గీత కార్మికులు గమనించి, జమ్మికుంటలోని ఓ ప్రవేటు ఆసుపత్రికితరలించి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

నూతన పాలకవర్గం

సైదాపూర్: పురుషుల పొదుపు సంఘం సైదాపూర్ శాఖ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట వార్షిక మహాసభ గత పాలకవర్గం అధ్యక్షుడు పైడిపల్లి రవిందర్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం లావాదేవీలు చర్చించారు నూతన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా పైడిపల్లి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మారుతి, సభ్యులుగా రమేష్, సురేశ్‌కుమార్,యశ్వంత్‌వర్ధన్, శ్రీనివాస్, పరుశురాములు, శ్రీధర్, రమేష్, కార్తీక్, కిశోర్, శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ప్రకటించారు.

బాధ్యతల స్వీకరణ

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా ఎండీ అయాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేశాడు. మున్సిపల్ ఉద్యోగులు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు భాస్కర్, వాణి, పాషా, సదానందంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట టౌన్ సీఐగా రవి

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ సీఐగా వరగంటి రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా పరిధిలో రామడుగు, కేశపట్నం పోలీస్ స్టేషన్‌లతో ఎస్ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది, మూడేళ్లుగా జిల్లా మహిళాపోలీస్ స్టేషన్, ఇంటిలిజెన్స్ విభాగంలో సీఐ పని చేశారు. ప్రస్తుతం రామగుండం ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న తరుణంలో జమ్మికుంట టౌన్‌సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పట్టణ స్టేషన్ ఎస్ఐ రాజేశ్, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో శ్రీమహాగణపతి, పార్వతిదేవి సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీశివాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎలబాక రాజగోపాల్‌శర్మ, కల్వకుంట్ల మధుసూదనాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. గోపూజ, శ్రీవిఘ్నేశ్వర పూజ, ఋగ్వేద పారాయణం, పుణ్యాహవచనం, తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు వాల బాలకిషన్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో పోచమ్మ బోనాలు

సైదాపూర్: సైదాపూర్ గుట్టపై సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం సైదాపూర్, జాగీర్‌పల్లి గ్రామస్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇంటింటికీ బోనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాల నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు, పలు పార్టీల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చల్లూరులో ఉత్సవమూర్తుల ఊరేగింపు

నిధులు మంజూరు చేయాలని వినతి

గంగాధర: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజల ఇష్ట దైవం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. వందకోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. చొప్పదండి మండలంలో లెదర్‌పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మెట్టప్రాంతం చొప్పదండి నియోజకవర్గంలోనే మిడ్‌మానేర్, కాళేశ్వరం, ఎల్లంపల్లి పైపులైన్లతో పాటు వరదకాలువ నిర్మాణం చేశారని ఇక్కడి రైతులు సాగునీటికి తంటాలు పడుతున్నారని వరద కాలువపై తూములు నిర్మించి సాగునీరందించాలన్నా. నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి కుడి, ఎడమ కాలువల పనులు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 90శాతం పూర్తికాగా పది శాతం పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో పూర్తి చేయలేదన్నారు. మిగులు పనులు పూర్తి చేయించి రైతులకు సాగునీరందించాలని, గంగాధర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, వానాకాలంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతు చేయించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యం

కత్తెర పురుగు నివారణపై దృష్టి సారించాలి

చొప్పదండి: ప్రస్తుతం మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి పెరిగిందని, నివారణపై రైతులు దృష్టి సారించాలని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ. విజయభాస్కర్ కోరారు. మండంలోని రుక్మాపూర్‌లో వరి, మొక్కజొన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. సూచించిన మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వెంట వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

గంగాధర: మండలంలోని కురిక్యాల, గర్శకుర్తి, మల్లాపూర్, బూర్గుపల్లి గ్రామాల్లోనిని రైతు వేదికల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరి సాగులో మెలుకువలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వరిని ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర పోషక యాజమాన్యం, పీఎం కిసాన్ ఈకేవైసీ తదితర అంశాలను వివరించారు. భూసార పరీక్షల ఆవశ్యకత, వేపనూనె వినియోగంతో ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజు, విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రుక్మాపూర్‌లో వ్యవసాయ శాస్త్రవేత్త పర్యటన

క్షేత్ర సందర్శన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్,రాజాపల్లి గ్రామాల్లో వరి పంటలను శుక్రవారం ఏవో సునిల్ కుమార్ పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో జింక్ లోపం నివారణకు ఎకరానికి 500 గ్రా ల్యాబ్ జింక్‌ను వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులుకు నివారణకు వాడే పురుగు మందుల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజవకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలకు పార్టీ అందరికి అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా నిరుపేదలకు లబ్ధి పొందేలా కృషి చేయాలన్నారు. కష్టపడి పని చేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు రేణుకశివకుమార్‌గౌడ్, నాయకులు పొనగంటి మల్లయ్య, అరుకాల వీరేశలింగం, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, ఎండ సలీం, సజ్జు, ఇమ్రాన్, సతీష్‌రెడ్డి, సలీంపాషా,రవి,పోతుల శ్రీనివాస్, సన్నీతోపాటు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం నాయకులు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ప్రణవ్ అన్నారు. సిర్సపల్లి క్రాస్ రోడ్‌లోని బాలగార్డెన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని, ఆరు గ్యారెంటీలపై ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు బాబు, పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్య, సీనియర్ నాయకుడు కాజీపేట శ్రీనివాస్, టౌన్ మహిళ అధ్యక్షురాలు వేముల పుష్ప లత, సీనియర్ నాయకులు స్వామిగౌడ్, రవి, సీనియర్ మహిళా నాయకురాలు తిరుమల, శంకర్, సునీత,లక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, దశరథం, ఎండీ అఫ్సర్, రవీందర్, కుమారస్వామి ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

అనాథ పిల్లల జన్మదిన వేడుకలు

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో పదిమంది అనాథ బాలబాలికల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరయ్యారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాల వికాస కో ఆర్డినేటర్ ఖాజాబీ, మెంబర్స్ లీలా, రజిత ఉన్నారు.

ఎంపీడీవోలకు సన్మానం

రామడుగు: రామడుగు మండల ఎంపీడీవోగా బాధ్యలు స్వీకరించిన సంగీ రాజేశ్వరిని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు దేవిక, మహేందర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శంకర్‌ను ఎంపీపీ లింగాల మల్లారెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి, ఇతర కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి సునీల్, మాజీ ప్రజాప్రతినిధులు చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు మల్లేశం, లింగంపల్లి బాలరాజు, బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారులు అన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు సమస్య వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గుడ్ టచ్,బ్యాడ్ టచ్ విషయలు, ఇంటర్నెట్ వినియోగం, యోగా వివిధ అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. బాలికలు పోషకారారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వేధింపులకు గురైతే షీ టీంను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు పోషకాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సోషల్ వర్కర్లు, ఏఎస్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.